# ఉద్యోగం కథ

ఓ నాడు—

అనుకోకుండా ఆ నగరానికి ఓ సర్కస్ కంపెనీ వచ్చింది.

ఆ కంపెనీలో ఏవో ఉద్యోగాలు ఖాళీగా వున్నాయని ఎవరో చెప్పగా విని, ఎందుకైనా మంచిదని దరఖాస్తు పెట్టాడు. దేవుడికి రెండు టెంకాయలు కొట్టాడు బుచ్చబ్బాయ్.

ఇంటర్వ్యూ వచ్చింది వెంటనే,

ఆ ఇంటర్వ్యూ కార్డును ముద్దుపెట్టుకున్నాడు. సోడాబుడ్డి కళ్ళద్దాలను మూడుసార్లు సర్దుకొని ఇంటర్వ్యూ కోసం పుస్తకాలు తెగ చదివాడు.

*　　　*　　　*

ఇంటర్వ్యూ జరిగింది.

అంతా సీక్రెట్

ఆ సర్కస్ కంపెనీలో అనుకోకుండా ఓ పులి చనిపోయిందంట. దాని స్థానే ఆ వేషంలో 'బుచ్చబ్బాయ్'ను అపాయింట్ చేశారు. విషయం బయటకు పొక్కకూడదన్నారు. తెలిస్తే ఉద్యోగం ఊడుతుంది.

అందుకే కిమ్మనకుండా ఒప్పుకున్నాడు బుచ్చబ్బాయ్.

వెంటనే వెళ్ళి డ్యూటీలో జాయిన్ అయ్యాడు.

తొలిసారిగా పులివేషంలో అచ్చం పులిలా బోనెక్కాడు బుచ్చబ్బాయ్.

బుచ్చబ్బాయ్ గెటప్‌ను ఓ సారి ఫైనల్ చెక్ అప్ చేసిన సర్కస్ కంపెనీ మేనేజర్—వేషం వేసినా వదిలిపెట్టని సోడాబుడ్డి కళ్ళద్దాలను లాగేసుకున్నాడు.

కొంచెం మసకమసగ్గావున్నా, కనిపిస్తూనే వుంది. "పూర్తిగా కనిపించకున్నా బావుణ్ణు" అని ఓ క్షణం వాపోయాడు బుచ్చబ్బాయ్.

అయినా ఆ మొర ఏ దేవుడూ ఆలకించలేదు.

కళ్ళు మరింత వెడల్పుచేసి, ఆశగా చూశాడు. ఎదురుగావున్న బోనులో సింహం కనిపించింది. గుండె ఓ క్షణం ఆగి, మళ్ళీ స్పందించసాగింది. సింహం కన్నార్పకుండా బుచ్చబ్బాయ్‌నే చూస్తూవుంది.

మిగిలిన పులుల విషయం తరువాత, ముందీ సింహం వదిలేలాలేదు.

బుచ్చి గుండె లయ తప్పింది.

గ్రామ సింహం అంటేనే భయం—మరిది సింహం. ఆశ్చర్యం ఏమిటంటే, ఆ సింహం బుచ్చబ్బాయినే తదేకంగా చూడసాగింది.

బుచ్చికి చెమట్లు పట్టాయ్. గజగజ వణికిపోసాగాడు.

బాగా గమనించాడు. సింహం బుచ్చి బోను ప్రక్క అరలోనే వుంది.

ఇనుపకడ్డీల తలుపే అడ్డం.

బుచ్చబ్బాయ్ రక్తం నాళాల్లో ఎదురు తిరిగి ప్రవహించసాగింది.

ఇక లాభంలేదు. ప్రాణాలు పోయేలా వున్నాయ్. ఇక తలుపు తెరుచుకొని పారిపోవడమే శరణ్యం.

బుచ్చి కళ్ళలో కన్నీళ్ళు.

అప్పుడా సింహం కదిలి, యిలా మాట్లాడింది. "భయపడకు. ఇద్దరం ఉద్యోగస్తులమే. నువ్వు బి.ఏ; నేను ఎమ్.ఏ. అంతే"

—o—